బీజేఆర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాదిగల ద్రోహి కాంగ్రెస్ పార్టీ

వికారాబాద్, ఏప్రిల్ 7 : తెలంగాణలో 70 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంట్ స్థానం కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీనీ ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఆదివారం వికారాబాద్ లోని బీజేఆర్ చౌరస్తాలో మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో 4% లేని రెడ్లకు 6 స్థానాలు కేటాయించుకొని, 50%కి పైగా ఉన్న బీసీలకు 2 స్థానాలు, 12% పైగా ఉన్న మాదిగలకు స్థానమే లేకుండా చేయడం ద్రోహం కాదా అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ఒక్క కులానికే కొమ్ముకాస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సీట్లలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే, రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని రెండు స్థానాలను మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా పది రోజుల పాటు నిరసన కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకుడు రవికుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాశ్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ, సీనియర్ నాయకులు శ్రీశైలం, మోహన్, బాబు, సూర్యప్రకాశ్, నగేశ్, నర్సింహులు, నరేశ్, శ్యామ్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ వాగ్దానాలను ప్రజలు నమ్మరు

బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 7 : అటు రాష్ట్రంలో.. ఇటు దేశంలోనూ కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడంలేదని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ నాయకులు రెండు పైసలు కూడా ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువకులను మోసం చేశారని తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా గ్రామాల్లోకి వెళ్లిన తనను నిరుపేద వృద్ధులు ఎదురు వచ్చి పెన్షన్ పెంచలేదని వాపోతున్నారన్నారు. అటు కరెంటు.. ఇటు నీళ్ల సమస్య రోజురోజుకూ పెరిగిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో చిల్లిగవ్వ కూడా లేదని, కేంద్ర ప్రభుత్వ నిధులతో వికారాబాద్ జిల్లాలో గ్రామాలకు రోడ్లు వేయిస్తున్నారన్నారు. ధారూరు మండల కేంద్రంతోపాటు మున్నూరు సోమారం, పీలారం, రాళ్లచిత్తంపల్లి, గడ్డమీది గంగారం, నాగారం, మామిడికలాన్ గ్రామాల్లో కొనసాగిన బీజేపీ ప్రజా ఆశీర్వాద యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. యాత్రలో బీజేపీ వికారాబాద్ జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

విజయారెడ్డి వర్సెస్ దానం

ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో విభేదాలు - రంగంలోకి సీఎం రేవంత్

సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని ముఖ్యనాయకులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్, ఏప్రిల్ 7 : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు టికెట్ కేటాయించడంతో నేతల మధ్య విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా ఉన్న పీజేఆర్ కుమార్తె పి.విజయారెడ్డి, దానం నాగేందర్ కలిసి పనిచేయాల్సి రావడాన్ని వారి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో పాత కాంగ్రెస్ కార్యకర్తలు, కొత్త కార్యకర్తలు అనే చీలిక ఏర్పడింది. తాజాగా శనివారం నిర్వహించిన తుక్కుగూడ జన జాతర సభ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతల మధ్యన విభేదాలను మరోసారి తెరపైకి తెచ్చింది. విజయారెడ్డి నాయకత్వంలో ఐమాక్స్ వద్ద నుంచి కార్యకర్తలు సభకు తరలివెళ్లగా, ఎమ్మెల్యే దానం నాగేందర్ నాయకత్వంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు ఫిలింనగర్ నుంచి వేరుగా సభకు వెళ్లారు.

రానున్న ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే వచ్చే ఉప ఎన్నికల్లో టికెట్ ఖచ్చితంగా విజయారెడ్డికే వస్తుందని ఆమె వర్గీయులు చెబుతుండగా, దానం నాగేందర్ కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారంటూ ఆయన వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. దీంతో నేతల మధ్యన విభేదాలు పరిష్కరించేందుకు ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమైన సీఎం రేవంత్ కలిసి పనిచేయాలని సూచించారు. సమావేశంలో సైతం విజయారెడ్డి, దానం నాగేందర్ ఎడమొహం పెడమొహంగానే ఉండడంతో ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో అని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిపక్ష నేతలపై బూటకపు కేసులు, అరెస్టులు

మోదీ నియంతృత్వానికి నిదర్శనం

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

ఇందిరాపార్కు ధర్నాచౌక్ దీక్షలో మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా.సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 7 : చట్ట విరుద్ధంగా ప్రతిపక్ష నేతల నిర్భంధం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని 'ఇండియా' కూటమి నేతలు తెలిపారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు బీజేపీకి రాజకీయ ఆయుధాలుగా పనిచేస్తున్నాయని, ప్రతిపక్ష నేతలపై నిర్దాక్షిణ్యంగా దాడులు, బూటకపు కేసులు, అరెస్టులు ప్రధాని మోదీ నయా నియంతృత్వానికి నిదర్శనమని వారు చెప్పారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సామూహిక నిరాహార దీక్షలు చేపట్టాలని ఆప్ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఆప్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది ఆప్ శ్రేణులతో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సామూహిక నిరాహార దీక్షలకు తెలంగాణ రాష్ట్ర ఇండియా కూటమి నేతలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్ బాలమల్లేశ్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఆర్ఎస్పీ ప్రధాన కార్యదర్శి జానకీరామ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎంఆర్‌జీ వినోద్ రెడ్డి తదితరులు దీక్షా శిబిరానికి హాజరై మద్దతు తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్‌పై పెట్టిన బూటకపు కేసులను ఉపసంహరించుకొని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కేజ్రీవాల్ బీజేపీని దెబ్బతీస్తాడని మోదీ భయపడి, కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారని ఆరోపించారు.

కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బుర్రా రాముగౌడ్, సోలోమన్ రాజు, ఎంఏ మాజీద్, మహిళా విభాగం కన్వీనర్ హేమా జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునాగౌడ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, దివ్యాంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేశ్, యువజన విభాగం అధ్యక్షుడు విజయ్ ముల్లంగి, నేతలు కొడంగల్ శ్రీనివాస్, శివాజీ, మౌనిక, అస్లామ్ ఉన్నారు.

'పీఎంఆర్‌వై' పేరుతో మోసం..

రూ.12.90 లక్షలు స్వాహా

వెంగళరావునగర్, ఏప్రిల్ 7: పీఎంఆర్‌వై పథకం ద్వారా భారీగా రుణాలు ఇప్పిస్తానని నమ్మించి.. రూ.12.90 లక్షలు వసూలు చేసి, మోసాలకు పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట న్యూసైన్స్ కాలనీకి చెందిన ఎం.తేజకు వినీత్, వికీ గౌడ్ కలిసి ఓ మధ్యవర్తి ద్వారా పరిచయమయ్యారు. హైదరాబాద్‌తో సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పీఎంఆర్‌వై పథకం ద్వారా చాలా మందికి రుణాలు ఇప్పించామని, కేంద్ర, రాష్ట్రాల్లో తమకు మంచి పలుకు బడి ఉన్నదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరయ్యే రూ.12 లక్షల పీఎంఆర్‌వై రుణానికి రూ.40 వేల కమీషన్, రూ.18 లక్షల పీఎంఆర్‌వై రుణానికి రూ.50 వేలు కమీషన్ చొప్పున వసూలు చేశారు. బాధితుడు తేజ, తన బంధువులు, స్నేహితుల నుంచి మొత్తం రూ.12.90 లక్షల డబ్బును వినీత్, వికీ గౌడ్ వసూలు చేశారు. రెండేళ్లు గడిచినా రుణాలు మంజూరు కాకపోవడంతో వినీత్, వికీ గౌడ్‌ను నిలదీశారు. డబ్బు తిరిగి ఇస్తామని చెప్పి కాలం గడిపారు. వసూలు చేసిన డబ్బు తిరిగి ఇవ్వాలని పట్టుబట్టగా.. బాధితులను భయపెట్టి, బెదిరింపులకు గురిచేశారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై హత్యాయత్నం..

ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 7: పాత కక్షలతో ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రోడ్ నం. 12లోని శ్రీరాంనగర్‌లో నివాసముంటున్న వంశీ (27) ఇంటీరియర్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన స్నేహితులు బబ్లూ, ప్రశాంత్, నర్సింహాతో కలిసి ఖైరతాబాద్‌లో జరిగిన పార్టీకి వెళ్లిన వంశీ.. రాత్రి 11.30 సమయంలో తిరిగి వచ్చారు. ఇదిలా ఉండగా.. వారం రోజుల కిందట నాని అనే యువకుడితో ఎన్‌బీటీనగర్‌లో జరిగింది. ఈ విషయమై మాట్లాడదామంటూ నాని సోదరుడు చింటూ వంశీకి ఫోన్‌కాల్ చేసి పిలిచాడు. దీంతో బంజారాహిల్స్ రోడ్ నం. 13కు వచ్చిన వంశీతో నాని, చింటూ, సుమిత్ గొడవకు దిగారు. మాటామాటా పెరగడంతో కోపంతో నాని తన వద్ద ఉన్న కత్తితో వంశీపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన వంశీని స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడు నాని, ఇతరులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎండీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

పాదచారుల దాహార్తికి తీర్చేందుకు చలివేంద్రాలు

- తొలి విడుతలో రెండు, విడుతలవారీగా అన్ని రద్దీ ప్రాంతాల్లో ఆమలు
- స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే నీటిని ఉచితంగా సరఫరా చేస్తాం
- రంజాన్ నేపథ్యంలో మసీదులకు ట్యాంకర్ల ద్వారా నీరు
- జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి వెల్లడి

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : వేసవి దృష్ట్యా పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు జలమండలి సిద్ధమైంది. ఇందులో భాగంగా చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. బసవతారకం, మెహిదీపట్నం రైతుబజార్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రతతో నగరంలోని పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చాలని జలమండలి నిర్ణయించినట్లు ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పలు ఆసుపత్రులు, బస్టాండ్‌లు, జన సంచారం ఎక్కువగా ఉండే ఇతర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విడుతలవారీగా మిగతా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో జలమండలి ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు మంచి ఆదరణ వస్తే వాటిని ఏడాది పొడవునా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎండీ వెల్లడించారు. స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి ట్యాంకర్ ద్వారా ఉచితంగా నీరు సరఫరా చేస్తామని వివరించారు. ఇందుకు ఆయా డివిజన్ల అధికారులను సంప్రదించాలని సూచించారు. రంజాన్ నేపథ్యంలో మసీదులు ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎండీ అధికారులను ఆదేశించారు. అవసరం మేరకు మసీదులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సీవరేజీ ఓవర్‌ఫ్లో లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అజ్మీరా కృష్ణ, సీజీఎం వినోద్ భార్గవ, జీఎం హరిశంకర్, మహేందర్ నాయక్ పాల్గొన్నారు.

రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖ రాసిన దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 7: తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన కంటే కేసీఆర్ పరిపాలనే బాగుండేదని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. దళితుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. తార్నాకలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి బహిరంగలేఖ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ముత్తాత నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ, నాన్న రాజీవ్‌గాంధీ, అమ్మ సోనియా గాంధీ వరకు దేశంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘకాలంగా పరిపాలించింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కానీ దేశంలో 50 కోట్ల మంది దళితుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ నాయకులు విఫలం చెందారని ఆరోపించారు. తెలంగాణలో రెడ్ల పాలన కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర అన్ని కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 15వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని, రూ.500 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

విస్తృతంగా తనిఖీలు

రూ.12.62 కోట్ల నగదు సీజ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇప్పటి వరకు రూ.12.62 కోట్ల మేర నగదును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. కోటీ 73 లక్షల 60వేల 502 రూపాయల విలువజేసే ఇతర వస్తువులు, రూ.19,380 లీటర్ల అక్రమ మద్యాన్ని కూడా పట్టుకున్నట్లు కమిషనర్ తెలిపారు. 141 మందిపై కేసులు నమోదు చేసి, 136 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 280 ఫిర్యాదులు రాగా.. వాటిని పరిష్కరించామన్నారు. 185 మందిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసినట్లు చెప్పారు. లైసెన్స్ ఉన్న 2409 ఆయుధాలను డిపాజిట్ చేసినట్లు ఆయన తెలిపారు. గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.13.13 లక్షల నగదు, రూ.34 వేల విలువైన వస్తువులను పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 22.44 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నగదు, ఇతర వస్తువులపై 11 ఫిర్యాదులు రాగా.. వాటిని పరిష్కరించామని, నలుగురిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్థిక లావాదేవీల వల్లే..
మహిళ ను హత్యచేసిన శంకరయ్య

వివరాలు వెల్లడించిన సీఐ నరేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7: ఆర్థిక లావాదేవీల వల్లే యాదమ్మ(40)ను నిందితుడు శంకరయ్య హత్య చేశాడని ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వివరాలను వెల్లడించారు. మండలం పరిధిలోని పాలమాకుల గ్రామానికి చెందిన యాదమ్మ (40) ఇంట్లో నిందితుడు శంకరయ్య కొంతకాలం అద్దెకు ఉన్నాడు. అదే సమయంలో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో అతడు.. ఆమె వద్ద నుంచి మొదట లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న అప్పును తిరిగి చెల్లించలేదు. మరోసారి మరిన్ని డబ్బులు అప్పుగా తీసుకొని, తిరిగి చెల్లించలేదు. ఆమె నుంచి బంగారు ఆభరణాలు సైతం అతడు తీసుకొని తిరిగి ఇవ్వకుండా తప్పించుకుంటున్నాడు. దీంతో వీరిద్దరి మధ్య గొడవలు జరిగి.. దూరంగా ఉంటున్నారు. మార్చి 27న కుటుంబ సభ్యుల వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఆమె.. తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మార్చి 28న శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ఏప్రిల్ 5న శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసు మిస్టరీని ఛేదించారు. యాదమ్మ ఫోన్ కాల్‌డేటా ఆధారంగా నిందితుడిని గుర్తించారు. మండలం పరిధిలోని సంఘిగూడ గ్రామానికి చెందిన శంకరయ్య అనే వ్యక్తి ఆమెను మార్చి 27న సాయంత్రం పెద్దషాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి తన ద్విచక్ర వాహనంపై సంఘిగూడలోని తన ఆధీనంలో ఉన్న వ్యవసాయ పొలానికి తీసుకుపోయాడు. అక్కడ ఇద్దరు కలిసి కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య అప్పు విషయంపై గొడవ జరిగింది. మాటామాట పెరగడంతో.. కోపంతో అతడు పారతో ఆమె తలపై గట్టిగా కొట్టాడు. ఆమె తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కంగుతిన్న శంకరయ్య.. ఆమె శవాన్ని ఎవ్వరికీ అనుమానం రాకుండా వ్యవసాయ పొలంలో పైపులైన్ కోసం తీసిన గుంతలో పాతి పెట్టాడు. పోలీసుల విచారణలో శంకరయ్య చంపినట్టు తేలడంతో అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం కావడంతో రాజేంద్రనగర్ కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పీవీ తన తండ్రి కావడం గర్వకారణం

ఎమ్మెల్సీ సురభీ వాణిదేవి

రవీంద్రభారతి, ఏప్రిల్ 7 : జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి 80వ జన్మదినం సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్‌కు పురస్కారం సగౌరవ సమర్పణ కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అంపశయ్య నవీన్, కవి ఎలనాగ, ఆచార్య చెన్నకేశవరెడ్డిలకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశానికే గర్వకారణమైన మహోన్నత వ్యక్తి పీవీ నరసింహారావు అని, ఆయన తన తండ్రి కావడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీవీ ప్రభాకర్‌రావు, రామకృష్ణారావు, ఆచార్య లక్ష్మీనారాయణ, సురేందర్‌రావు, శంకర్‌రెడ్డి, నాళేశ్వరం శంకరం పాల్గొన్నారు.



ఆచార్య చెన్నకేశవ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 7 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ(అప్లైడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ న్యూట్రిషన్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, దూర విద్య ద్వారా అందించే ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. బీబీఏ, బీబీఏ(బిజినెస్ అనాలిటిక్స్), బీబీఏ (రిటైల్ ఆపరేషన్స్, లాజిస్టిక్స్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్), బీకామ్, బీఏ, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ తదితర అన్ని డిగ్రీ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

కోర్సుల ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. దీంతో పాటు బీఫార్మసీ అన్ని సెమిస్టర్ల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశామన్నారు.

పరీక్షల ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలతో పాటు దూరవిద్యా విధానంలో అందించే పీజీ డిప్లొమా ఇన్‌డేటా సైన్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల10వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, రూ.200 అపరాధ రుసుముతో 13వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. జవాబుపత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చెల్లించి ఈ నెల 10వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

కాచిగూడ, ఏప్రిల్ 7 : వడదెబ్బతో గుర